నమస్తే తెలంగాణ

# సూర్యాపేట

I నల్లగొండ, బుధవారం 7 మే 2025 SURYAPET



కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




## తులం బంగారం ఎప్పుడిస్తారో?

- ఇంకా కేసీఆర్ ఇచ్చిన రూ.లక్ష చెక్కులే ఇస్తున్నారు
- అడబిడ్డ తల్లిదండ్రులు ఆశతో చూస్తున్నారు
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- పలువురికి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

సూర్యాపేట, మే 6 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడదిన్నర అవుతున్నా ఇంకా కేసీఆర్ పెట్టిన రూ.లక్ష చెక్కులే ఇస్తున్నారని, రూ.లక్షతో పాటు తులం బంగారం ఎప్పుడిస్తారో అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ప్రభుత్వాని ప్రశ్నించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం సూర్యాపేట నియోజకవర్గానికి చెందిన 306 మందికి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇంకా ఎందుకు ఇవ్వడం లేదన్నారు. దీని కోసం ఆడబిడ్డల తల్లిదండ్రులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అవుతున్న ఏ ఒక్క పథకం సక్రమంగా అమలు కావడం లేదన్నారు. ఆడబిడ్డ ఇంటికి బరువు కాదు వరం అని నాడు కేసీఆర్ వారి పేరు మీద ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రపంచంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆడబిడ్డ పెండ్లికి ప్రభుత్వం సహాయం చేయడం ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేశారని చెప్పారు. తొలుత రూ. 50 వేలు, ఆ తర్వాత రూ. 1,00,116 పెంచారని గుర్తు చేశారు. ఇక తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం కేసీఆర్ కిట్టు ఇచ్చామని, కానీ ఆ పథకం అలానే కొనసాగిస్తే బాగుండేదని తెలిపారు. తమ ప్రభుత్వంలో బిడ్డ కడుపులో పడ్డప్పటి నుంచి కాటికి పోయే వరకు వివిధ వర్గాలకు ఏదో ఒక సంక్షేమ పథకం అందేలా చేశామని, కానీ ఇప్పుడు అన్నీ పోయి కొన్ని మాత్రమే ఇస్తున్నారని ప్రజలు వాపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని ఆనాడు ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబ పెద్దలా పాలించారని, ఇప్పుడు ప్రజలు కేసీఆర్ పాలన గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలన్నీ పూర్తి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సూర్యాపేట మండలం, మున్సిపాలిటీ పరిధి, పెన్‌పహాడ్, చివ్వెంల , ఆత్మకూర్(ఎస్) మండలాల చెందిన 306 మందికి రూ. 1,00,116 చొప్పున రూ. 3,06,35,496 చెక్కులను ఈ సందర్భంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, పర్యాటక కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, ఆర్డీఓ వేణుమాధవరావు, తాసీల్దార్లు శ్యాంసుందర్‌రెడ్డి, లాలు, హరికిశోర్ శర్మ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐఐహెచ్‌టీ ఏర్పాటయ్యేనా..?

## మంత్రి తుమ్మల ప్రకటనతో చేనేతల్లో ఆశలు



- పోచంపల్లిలోనే ఏర్పాటుకు నాడు ఉత్తర్వులు
- తరలింపునకు సీఎం రేవంత్ రెడ్డి ప్లాన్
- ఐఐహెచ్‌టీ ఏర్పాటుపై ఊపందుకున్న డిమాండ్లు
- ఎన్నో ఏండ్ల స్వప్నం సాకారమయ్యేనా..?

**భూదాన్ పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ.. నేతన్నల చిరకాల స్వప్నం, ఆకాంక్ష. కార్మికుల సెంటిమెంట్, భావోద్వేగంతో కూడిన డిమాండ్. కానీ కార్మికుల ఆశలను ప్రస్తుత కాంగ్రెస్ కల్లగానే మిగులుస్తున్నది. దశాబ్దాలుగా కొట్లాడి తెచ్చుకున్న ప్రఖ్యాత సంస్థను గద్దలా ఎగరేసుపోతున్నది. పోచంపల్లిలోనే ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రకటనతో చేనేతల్లో మళ్లీ ఆశలు రేకెత్తాయి.**

– యాదాద్రి భువనగిరి, మే 6 (నమస్తే తెలంగాణ)




పోచంపల్లి మండలం కనుముక్కలలో నిరుపయోగంగా ఉన్న హండ్లూమ్ పార్కు

దేశంలోనే అత్యుత్తమ చేనేత నైపుణ్య విద్యాసంస్థగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి పేరుంది. విద్యకు ఐఐటీ మాదిరిగా చేనేతకు ఐఐహెచ్‌టీగా పరిగణిస్తారు. అయితే పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ కోసం ఎన్నో ఏండ్లు పోరాటాలు జరిగాయి. పద్మశాలి, నేత కార్మిక సంఘాలు దీనిపై అనేక విజ్ఞాపనలు చేశాయి. గత బీఆర్‌ఎస్ హయాంలో రాష్ట్ర మంత్రులు కేంద్రానికి వినతులు అందించాయి. ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేశాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం సంస్థను మంజూరు చేసింది.

### పోచంపల్లిలోనే ఏర్పాటుకు ఉత్తర్వులు కూడా..

పర్యాటక ప్రాంతం, చేనేతకు పేరుగాంచిన పోచంపల్లిలోనే సంస్థను ఏర్పాటు చేయాలని గతంలోనే ప్రతిపాదనలు ఉన్నాయి. రాష్ట్రానికి మంజూరు కావడంతో పోచంపల్లి మండలంలోని కనుముక్కలలో ఏర్పాటు చేస్తూ గతేడాది ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నేతన్నల కల సాకారమైందని, ఎన్నో ఏండ్లుగా నేత కార్మికుల చేస్తున్న ఆందోళనలు, విజ్ఞప్తులకు సార్థకత లభించిందని ఎంతో సంబురపడ్డారు.

### సొంత జిల్లాకు తరలింపునకు సీఎం ప్లాన్

ఐఐహెచ్‌టీని తన సొంత జిల్లాకు తరలించుకుపోవడానికి సీఎం రేవంత్ రెడ్డి ప్లాన్ చేశారు. వాస్తవానికి పోచంపల్లికి ఐఐహెచ్‌టీ మంజూరు కావడంతో ఇక్కడే ప్రారంభించాలి. కానీ సమయాభావం, అత్యవసరం అంటూ గతేడాది తాత్కాలికంగా హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ క్యాంపస్‌లో ఏర్పాటు చేశారు. తర్వాత ఇక్కడే ఏర్పాటు చేస్తారని అంతా నమ్మారు. కానీ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఫోర్త్ సిటీలోని స్కిల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తామని స్వయంగా రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీంతో ఇటు స్థానిక ఎమ్మెల్యే, అధికారులు ఏమీ చేయలేక చేతులెత్తేశారు.

### సానుకూల అంశాలు.. వసతులు..

రాష్ట్రంలో నలభై వేల చేనేత కుటుంబాలు ఉండగా, అధికంగా భూదాన్ పోచంపల్లిలోనే నేత కార్మికులు ఉన్నారు. పెద్దఎత్తున వస్త్ర వ్యాపారం, తయారీ రంగం ఉంది. ఇక్కడ ఐఐహెచ్‌టీ ఏర్పాటైతే చేనేత, జౌళి, డిప్లొమా డిగ్రీ పీజీ కోర్సులతోపాటు పరిశోధనలు, అభివృద్ధి అధ్యయనాలు జరిగే అవకాశం ఉంటుంది. చేనేత పరిశ్రమ మరింత బలోపేతం అవుతుంది. కనుముక్కలలో ఉన్న హ్యాండ్లూమ్ పార్క్‌లో భవనాలు అందుబాటులో ఉన్నాయి. ఇది 26 ఎకరాల్లో విస్తరించి ఉంది. ప్రస్తుతం పార్కులోని విశాలమైన భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. వీటికి మరమ్మతులు చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

### మంత్రి ప్రకటనతో మళ్లీ ఆశలు..

ఇటీవల పోచంపల్లిలో జరిగిన కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐఐహెచ్‌టీ పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాలని పలువురు చేనేత ప్రతినిధుల వినతి పత్రం అందించి ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన స్పందిస్తూ.. పోచంపల్లిలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో నేతన్నల్లో మరోసారి ఆశలు చిగురించాయి. ఈ నేపథ్యంలో పోచంపల్లిలోనే ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేయాలనే డిమాండ్లు వివిధ వర్గాల నుంచి పెరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే సైతం ప్రత్యేక చొరవ చూపాలని కోరుతున్నారు.

### ఐఐహెచ్‌టీ పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం మంజూరు చేసిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని భూదాన్ పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాలి. భూదానోద్యమం, చేనేత వస్త్రాల ఉత్పత్తికి ప్రసిద్ధి చెందింది ఈ ప్రాంతం. మారుతున్న కాలానుగుణంగా చేనేత కార్మికులు వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకునేందుకు హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఎంతగానో దోహదపడుతుంది. భావితరాల వారికి ఉపయోగపడుతుంది.

-అంకం పాండురంగం, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు, భూదాన్ పోచంపల్లి

### వృత్తి నైపుణ్యంతో భావితరాలకు ప్రయోజనం



చేనేత కార్మికులకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇస్తే మరింత నిష్ణాతులు అవుతారు. చేనేత కళాకారులకు అందుబాటులో ఐఐహెచ్‌టీని ఏర్పాటు చేస్తే పోచంపల్లి ఇక్కత్ పరిశ్రమ బలోపేతం అవుతుంది. చేనేత పరిశ్రమపై ఆధారపడిన వారందరికీ నూతన టెక్నాలజీతో వస్త్ర వ్యాపారం జరిగి ఉపాధి కలుగుతుంది. కళాకారులు, కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. చేనేత పరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటు అందించిన వారవుతారు.

-భారత లవకుమార్, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు

### ఐఐహెచ్‌టీని ఏర్పాటు చేస్తే సార్థకత



రాష్ట్రంలోనే తలమానికంగా ప్రసిద్ధి చెందిన భూదాన్ పోచంపల్లిలో ఐఐహెచ్‌టీని ఏర్పాటు చేస్తేనే సార్థకత లభిస్తుంది. ప్రభుత్వాలు పలు సంస్థలను భూదాన్ పోచంపల్లికి మంజూరు చేసినా కొందరు స్వార్థంతో రాజకీయాలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ప్రపంచ ఉత్తమ గ్రామీణ పర్యాటక కేంద్రమైన భూదాన్‌పోచంపల్లి మండలంలో హ్యాండ్లూమ్ పార్క్, రామానంద గ్రామీణ సంస్థలో ఐఐహెచ్‌టీకి అనుకూలమైన భవనాలు, వసతులు ఉన్నాయి. ఈ ప్రాంతంలో వారసత్వ చేనేత కళాకారులు సంప్రదాయ చేనేత వృత్తిని కొనసాగిస్తున్నారు. ఈ సెంటర్ ఇక్కడ ఉంటే చేనేత కార్మికులకు ప్రయోజనం చేకూరుతుంది.

- కొంక లక్ష్మీనారాయణ, చేనేత కార్మికుడు



నల్లగొండ రైల్వే స్టేషన్ ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి తదితరులు

## రైల్వేలో ప్రైవేటీకరణను విరమించుకోవాలి

- భద్రతా చర్యలు పెంచాలి
- నల్లగొండలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

రామగిరి, మే 6 : రైల్వే రంగంలో ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకించాలని, రైల్వేలో భద్రతా చర్యలు పెంచాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఎదుట ప్లకార్డులతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ దేశంలో ఇటీవల వరుసగా అనేక రైలు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రయాణికులు, లోకో పైలెట్లు, ట్రైన్ మేనేజర్లు, ట్రాక్ మైంటెనర్స్, కాంట్రాక్ట్ వర్కర్స్ పెద్ద సంఖ్యలో చనిపోయారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బరితెగించి రైల్వేను ప్రైవేటీకరిస్తున్నదని ఆరోపించారు. రైల్వేలో అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటియూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, నాయకులు సైదాచారి, అద్దంకి నరసింహ, సత్తయ్య, వెంకన్న పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి మాటలు హాస్యాస్పదం

- పెన్షనర్స్ సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వం
- ఎస్‌జీపీఏటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌జీపీఏటీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి

రామగిరి, మ 6 : తమకు హక్కుగా రావాల్సిన వాటిని అడిగినందుకు సీఎం రేవంత్‌రెడ్డి దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని, తనను కోసినా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేనని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ(ఎస్‌జీపీఏటీ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాడి భాస్కర్‌రెడ్డి, సీహెచ్ సుధాకర్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. 30 సంవత్సరాలుపైబడి విద్యార్థులను తీర్చిదిద్ది సేవ చేశామని, తాము దాచుకున్న డబ్బులు ఇవ్వాలని అడిగినందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఇలా స్పందించడం సమంజసంగా లేదన్నారు. ఇది పెన్షనర్స్‌ను అవమానించడమేనని, భవిష్యత్తులో కూడా తమ ఆర్థిక పరమైన డిమాండ్లను పరిష్కరించలేమనే చెప్పడం సీఎంకు తగదని తెలిపారు. వాగు దాటే వరకు ఓడ మల్లయ్య వాగు దాటినంక బోడ మల్లయ్య అన్న చందంగా సీఎం వైఖరి ఉందని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ ఎన్.అరుణాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేఎస్ రెడ్డి

## చర్చలు జరిపి ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**టీజీఆర్‌టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కోశాధికారి కేఎస్ రెడ్డి**

రామగిరి, మే 6 : ఆర్టీసీ కార్మిక సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరిపి సంస్థ సమస్యలను పరిష్కరించాలని టీజీఆర్‌టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి కేఎస్ రెడ్డి, నల్లగొండ డిపో గౌరవాధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమురయ్య భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని రవాణా శాఖ మంత్రి, అధికారులకు వినతి పత్రాలు అందజేసినా ప్రతిఫలం లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆర్టీసీ కార్మికుల సమస్యలను, జీతాల పెంపును గాలికి వదిలేసిందని తెలిపారు. పని భారం, ఉద్యోగభద్రత, అధికారుల వేధింపులు లాంటి అనేక సమస్యలతో ఆర్టీసీ కార్మికులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లో పెండ్లి ఉన్నా సెలవులు ఇవ్వకుండా అధికారులు వేధిస్తున్నారని తెలిపారు. యూనియన్లు, కార్మికుతో చర్యలు జరిపి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు కందుల నర్సింహ, శ్యాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ నల్లగొండ డిపో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముక్కముల నర్సింహ, ఉపాధ్యక్షులుగా ఎండీ ఇక్బాల్, రావుల నర్సింహ, కార్యదర్శిగా షేక్ గులాం రసూల్, సహాయ కార్యదర్శిగా బొప్పని ఆనందరావు, బోడ స్వామి, కోశాధికారిగా సీహెచ్ రేవతి, సభ్యులుగా రావుల వెంకన్న, డి.యాదయ్య, ముక్కముల లక్ష్మయ్య, నంద్యాల లింగారెడ్డిని ఎన్నుకున్నారు.

## ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో

వర్షానికి ధాన్యం తడిచిందని ఆవేదన



నల్లగొండ -దేవరకొండ ప్రధాన రహదారిపై లక్ష్మీదేవిగూడెం గ్రామ రైతుల ఆందోళన



మొలకెత్తిన ధాన్యం చూపుతున్న రైతులు

గుర్రంపోడ్, మే 6 : మండలంలోని లక్ష్మీదేవిగూడెం కొనుగోలు కేంద్రం పరిసరాల్లో మంగళవారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో ధాన్యం తడవడంతో రైతులు ఆందోళనకు దిగారు. లారీల కొరతతో రోజులు తరబడి ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోయారు. కొనుగోలు కేంద్రం పక్కన నల్లగొండ-దేవరకొండ ప్రధాన రహదారిపై కొద్దిసేపు రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. తన 260 బస్తాల ధాన్యం కాంటా వేసి ఐదు రోజులు గడిచిందని, ఇప్పుడు కురిసిన వర్షంతో బస్తాలు తడిచాయని, మళ్లీ ఆరబెట్టాల్సి రావడం భారంగా మారుతుందని రైతు నాగులవంచ శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు.

కొనుగోలు కేంద్రం మానిటరింగ్ అధికారి కమలాకర్ రేపటి నుంచి లారీలు సరిపడా వస్తాయని, వారంలో కేంద్రం ఖాళీ చేస్తామని రైతులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

## తేమ పేరుతో కోత

### రైతులను దగా చేస్తున్న మిల్లర్లు



ఆత్మకూర్.ఎస్ మండలం జనగాంలోని మిల్లు వద్ద ధాన్యం లారీ

ఆత్మకూర్.ఎస్, మే 6 : ధాన్యంలో తేమ ఉంటుంటూ రైస్ మిల్లర్లు కోత పెడుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూర్.ఎస్ మండల పరిధిలోని పాతర్లపహాడ్ ఐకేపీ కేంద్రం నుంచి తేమ శాతం పరీక్షించాక కాంటాలు వేసి 900 బస్తాల్లో ధాన్యాన్ని లారీలో మంగళవారం జనగాం మహాలక్ష్మి రైస్ మిల్లుకు పంపించారు. ధాన్యంలో తేమ ఉందని, తాలు ఉందని బస్తాకు అర కేజీ తరుగు తీశారని రైతులు వాపోయారు. లారీకి 5 నుంచి 6 క్వింటాళ్ల ధాన్యం కోత పెడుతున్నారని ఆరోపించారు. ఐకేపీ సెంటర్‌లో 40 కిలోలకుగాను 41 కిలోల ధాన్యం తూకం వేసి పంపగా రైస్ మిల్లర్లు మళ్లీ కోత విధించడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు కలుగచేసుకొని మిల్లర్ల ఆగడాలను అరికట్టాలని బాధిత రైతులు ఉప్పలయ్య, బాలస్వామి కోరుతున్నారు. దీనిపై ఏపీఎం మంజుల స్పందిస్తూ మిల్లర్లు తేమ, తాలు పేరుతో రైతులను సతాయిస్తున్నారని ఫిర్యాదులు వచ్చాయని, ఐకేపీ నిర్వాహకులను మిల్లు వద్దకు పంపి సమస్య పరిష్కారిస్తామని తెలిపారు.



లింగగిరిలో రోడ్డుపై బిందెలను అడ్డంగా పెట్టి నిరసన తెలుపుతున్న మహిళలు

## నీళ్లు ఇవ్వాలని మహిళల ఆందోళన

**లింగగిరిలో రెండు నెలలుగా రావడం లేదని మండిపాటు**

హుజూర్‌నగర్ రూరల్, మే 6 : మండల పరిధి లింగగిరి గ్రామంలోని ఎస్సీ కాలనీలో రెండు నెలలుగా నీళ్లు రావడం లేదని, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో మహిళలు ఖాళీ బిందెలతో స్థానిక రహదారిపై మంగళవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ నీళ్లతో పాటు బోరు వాటర్ కూడా ప్రతిరోజూ వచ్చేవని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నీళ్లు సక్రమంగా రావడం లేదని తెలిపారు. రెండు నెలలుగా రావడం లేదని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని మండిపడ్డారు. ఇకనైనా నీటి సమస్య తీర్చాలని కోరారు.